# గుణపాఠం

''ఎంతవరకూవెళ్తారు?''

"విశాఖపట్నం"

"అక్కడ బంధువులున్నారా?"

"లేరు, పనిమీద వెళ్ళుతున్నాను"

"అసలు మనదేఊరు?"

"చెప్పినా మీరు తెలుసుకోలేరు. ఆలూరనే గ్రామం"

"ఆ గ్రామానికి రెండుమైళ్ళదూరంలో పెద్ద దేవాలయముండాలి. ఆ దేవాలయ ధర్మకర్తలు సంస్కృతాంధ్రభాషలు అధ్యయనంచేసే పాఠశాల నెలకొల్పారు. దానికి అనుబంధంగా ఆ చెట్లకిందనే ఆగమశాస్త్రాలు బోధించే పండితులూ అభ్యసించేశిష్యులూ ఉండేవారు. కొంతకాలంక్రిందట, వేదపండితులూ ఘనాపాఠీలూ, వేదాలూ పనసలూ చెట్లకింద వల్లెవేసే విద్యార్థులతో అది ఒక గురుకులంలాఉండేది. నేనూ ఒకసారిచూశాను. ఇప్పుడూ అలాగేఉందా?" అడిగాడు.

"ఇప్పడలా ఎందుకుంటుంది? పూనుకొని ప్రారంభించిన పెద్దవాళ్ళందరూ దాటిపోయారు. క్రమంగా శిష్యులసంఖ్య తరిగిపోయింది. ఇప్పుడు సంస్కృతాంధ్ర పాఠశాలమాత్రమే నడుస్తోంది. ఆ పాఠశాల దివ్యంగానడిచినా అప్పుడు అక్కడ విద్యనేర్చినవాళ్ళకు భుక్తిగడపటంకష్టమైంది. అందుకే శిష్యవర్గం తరిగిపోయింది. ఉపాధ్యాయులంతా స్కూళ్ళల్లో తెలుగుటీచర్లుగాను పండితులుగాను నిలిచిపోయారు. ఎప్పుడో ఎవరో పండితులుకదా అని సన్మానంచేసి శాలువకప్పితే కడుపునిండుతుందా చెప్పండి?"

"నిజమే, కాలంమారిపోయింది. డిగ్రీలుఉన్నవాళ్ళకు్కూడా ఉద్యోగాలు దొరకని రోజులివి." ఆయన దిగవలసిన స్టేషనువచ్చింది దిగిపోయాడు.

పాండురంగం అక్కడి పాఠశాలలో విద్య ముగించి, అదే పాఠశాలలో ఉపాధ్యాయుడుగాచేరాడు. నూటఏభయిరూపాయలజీతం. ఎంతకాలమయినా ఎదుగూ బొదుగూ లేదు.

అతడికి ఏవిధంగానయినా డిగ్రీచదువుచదివి ప్రభుత్వోద్యోగం చేయాలని ఆశకలిగింది. ఎంతకష్టపడిఅయినా ఆంగ్లభాషను అభ్యసించాలనుకున్నాడు.

అప్పటినుంచీ ఆ చుట్టుప్రక్కల ట్యూషన్‌చెప్పేవారెవరైనా ఉన్నారా అని విచారించటం మొదలుపెట్టాడు.

పాండురంగం ఉన్నఊరికి ఆరుమైళ్ళదూరంలో రిటైరయిన కాలేజి ప్రిన్సిపల్ పెద్దవాళ్ళకు సులువైనపద్ధతిలో చదువుచెప్పి, పరీక్షలకు పంపుతున్నాడని తెలిసింది.

ఈసంగతివిన్న పాండురంగం ఉన్నఉద్యోగాన్ని వదలిపెట్టకుండా, పగలు మూడున్నరకు పాఠశాల మూసివెయ్యగానే, తల్లియిచ్చిన మినపరొట్టెతిని, మంచి నీళ్ళుతాగి, బస్సులో బయలుదేరి, ఆ ప్రిన్సిపల్‌దగ్గరకువెళ్ళి తన ఆశయాన్ని గురించి చెప్పాడు.

"మిమ్మల్ని మూడేళ్ళలో మెట్రిక్ పరీక్షకుకూర్చొబెడతాను. నాదగ్గర చదువుకున్న వాళ్ళెవరూ తప్పటంఅంటూఉండదు. ఈ మూడేళ్ళకూ ఐదువేలివ్వండి. తరువాతవిషయం మళ్ళీ మాట్లాడుకుందాము" అన్నాడు ప్రిన్సిపల్.

"రేపువచ్చి ఏసంగతీచెప్తానండి" దారిపొడుగునా ఆలోచించటం మొదలు పెట్టాడు పాండురంగం.

ఇలా చదువుచెప్పి పరీక్షలకు విద్యార్థులను పంపేవాళ్ళు ఇంకా ఒకరిద్దరు ఉన్నారనివిన్నాడు. డబ్బుఖర్చుకూడా ఇంతే కాని-ఈయన ప్రిన్సిపల్. వాళ్ళు లెక్చరర్లు, అందువల్లపాండురంగం ప్రిన్సిపల్ నారాయణగారినే ఎన్నుకున్నాడు.

ప్రిన్సిపల్ నారాయణగారి పద్ధతంతావేరు. ఆయన పరీక్షలలో ప్రశ్నలు ఏతీరుగాఉంటాయో గ్రహించిన అనుభవశాలి కనుక త్వరితగతిన పాఠాలుచెప్పి

వల్లెవేయించేవాడు. ఆయన దగ్గరచేరిన మూడేళ్ళకు పాండురంగం మెట్రిక్ పరీక్ష రాయటానికి సిద్ధమైనాడంటే ప్రిన్సిపల్ నారాయణగారు చెప్పేవిద్యావిధానమే కారణం.

ఈవిధంగా పాండురంగం తన ఆశయసిద్ధి కలిగేవరకూ ఇంటరు, బి. ఏ. పరీక్షలురాసి విజయం పొందాడంటే ప్రిన్సిపల్‌గారూ పాండురంగంచేసిన ఎనలేని కృషి అనే చెప్పవలసి ఉంటుంది.

ఒకనాడు ప్రిన్సిపల్ పాండురంగంతో "ఇంతకృషిచేసి పట్టభద్రుడవయినా వంటే నాకు చాలా సంతోషంగాఉంది. నీకు, బి.ఏ. అయినంతమాత్రాన ఉద్యోగం వస్తుందన్ననమ్మకం నాకులేదు. ఇంతకష్టంపడనేవడ్డావు. ఎం. ఏ. కూడా పూర్తి చెయ్యి. ఎం.ఏ. అయితే ఎక్కడో అక్కడ ఉద్యోగం రాకపోదు. నీవిప్పుడు ఇది వరకూ పడినంతకష్టం పడక్కర్లేదు. నీఅంతటనీవే చదువుకోవచ్చు. పైఎత్తున నేను ఉండనేఉంటాను. ప్రశ్నాపత్రాలకోసంరాశాను ఇంకా అవి తయారుకాలేదు. అయితే వాళ్ళే నాపేర పంపుతారు. ముందు మొదటి సంవత్సరం ప్రశ్నాపత్రాలు వస్తాయి రాగానే నీకిస్తాను.

పాండురంగం ఎం.ఏ. పరీక్షఅంటే మొదట భయపడ్డాడు. కాని మొదటి సంవత్సరం పరీక్షలు రాయగానే ధైర్యంవచ్చింది. రెండవసంవత్సరంకూడా రాయ గలనన్న నమ్మకం బాగా కలిగింది. ప్రిన్సిపల్‌గారి దగ్గరికివెళ్ళి తను చదివినవి చూపిస్తూ ఉండేవాడు.

ఏప్రిల్ నెలలో పరీక్షలురాసి ప్రిన్సిపల్‌గారి దగ్గరకొచ్చి తను ఎట్లారాసినదీ చెప్పగానే ఆయనెంతో సంతోషించి, "పాండురంగం! నీవు ష్యూర్‌గా పాసవుతా వోయ్. నీ విద్యాభ్యాసం ముగిసింది. పరీక్షాఫలితాలురాగానే నాకు కనబడు. అప్పుడు నేనేమయినా నీకు సహాయం చేయగలనేమో చూద్దాం" అన్నాడు.

ప్రిన్సిపల్‌గారికి పాండురంగంమీద అభిమానమేర్పడింది. చనువుగాకూడా మాట్లాడేవాడు పాండురంగానికి గురువుగారిపట్ల భక్తిగౌరవాలు ఏర్పడ్డాయి. ఈ విద్యాభ్యాసకాలంలో. అతడు గురువుగారికి అనుకున్నప్రకారం తల్లికి ఉత్తరం రాసి డబ్బు తెప్పించిఇచ్చాడు.

"నేను మళ్ళీ ఫలితాలు తెలిసిననాడు వచ్చి కలుస్తానుసర్. ఈలోపల

మా స్వంతఊరుకూడా ఒకసారివెళ్ళి మావాళ్ళనుచూడాలి" అంటూ ఆయనకు నమస్కరించి ఇంటికి బయలుదేరాడు.

పాండురంగం ఇంటికివచ్చేసరికి ఎప్పుడూ ఎనిమిదిదాటేది. ఆనాడు మరి కొంచెం ఆలస్యమయింది.

ఇంతకాలం ఓపికపట్టిన పాండురంగం భార్య యశోద ఆరోజు చిరు కోపంతో "పాపం. పిల్లలకు పాఠాలు చెప్పిచెప్పి అలసిపోయి ఉంటారనుకుని, వేడివేడిగా టీచేసి యివ్వాలనీ, ఎనిమిదిగంటలకే భోజనం పెట్టాలనీ, ఎంతో ఆరాటపడిచేసి తయారుగాఉంచుతున్నాను. ఏమిటీ? రోజురోజుకీ ఆలస్యం ఎక్కు వవుతున్నదేగాని మామూలువేళకు రావటంలేదు. ఎన్నిసార్లో అడగాలని నోటి వరకూవచ్చేది కాని స్కూల్లో ఏమయినా ఎక్కువపని తగిలిందేమో ననుకుని ఆగిపోయేదాన్ని. ప్రతిచిన్నవిషయం మీ అమ్మగారితోనూ బామ్మగారితోనూ మాటవరసకయినా అనలేదు. అయినా కొండేలుచెప్పటం నా కలవాటులేదు. ఇవాళ ఉండలేక అడుగుతున్నాను. మీరుఆలస్యంగా ఇంటికిరావటం మొదలుపెట్టి ఏళ్ళుగడుస్తున్నాయి. ఎక్కడికివెళ్ళుతున్నారు? ఏంసంగతి? ఈ యశోద పాతబడి పోయి రోతపుట్టించిందా?" ఎదురుగావెళ్ళి నిలవదీసి అడిగింది.

"ముందు భోజనంపెట్టి తరువాత అడుగు. చాలా అలిసిపోయాను."

మరీ రెట్టించి అతడికి కోపం తెప్పించటమెందుకని మాట్లాడకుండా వడ్డించింది యశోద. ఇద్దరూ మౌనంగా భోజనంచేశారు. వివరంగా తమలపాకులు వక్కలూ సున్నం పళ్లెంలో వేసుకువచ్చింది యశోద. తమలపాకులు వేసు కుంటూ "ఇంకచెప్పండి ఇన్నిసంవత్సరాల మీ చిత్రమైనకథ" అన్నది.

యశోద చాలా నెమ్మదిగా మాట్లాడుతుంది. ఎప్పుడూ అరుపులూ ఆగాలు ఆయింట్లో కనబడవు - సరాగాలుతప్ప. ఎప్పుడైనా చిలిపిపనులుచేసి అతడిని తబ్బిబ్బుచేసి ఆడిస్తుంది. స్కూలునుంచిరాగానే టీ చేతికిస్తూ ! పాఠాలుచెప్పి అలిసిపోయారుగాని అట్లా మంచంమీదకూర్చోండి. నేను కబుర్లుచెబుతాననేది. రోజూ అదో ఇదో రేడియోలో విన్నవో తను చూసిననో హాస్యంగాచెప్పి అతడిని నవ్వించేది.

అత్తగారు బామ్మగారు తెలిసిన సంబంధమని పాండురంగానికి నచ్చచెప్పి

పెళ్ళిచేశారు. అందరూ ముత్తానికి ఆమె చూడటానికి చక్కగా ఉంటుందనేచేశారు. మర్యాదా మన్ననగలపిల్ల అని లోపల్లోపల సంతోషిస్తూఉండేవారు. పాండురంగం ఉద్యోగంచేసేఊరు ఐదుమైళ్ళదూరమే అయినా అక్కడే ఒకచిన్న ఇల్లు పొందికగా ఆ యిద్దరికీ సరిపడా కట్టించింది బామ్మగారు. ఒంటరికాపరమయినా చక్కగా తీర్చిదిద్దుకుంటూ వస్తున్నది యశోద.

ఆ ఎదురుగా నిలబడి అతడిని నిలదీసి అడగటం కూడా ఇదే మొదటిసారి.

"ఇరుగూ పొరుగూ ఉన్నారు. చీకటి పడకముందే పక్కింటి మామ్మగారు వస్తారు కబుర్లు చెప్పటానికి. "ఇంట్లో తలుపులేసుకుని ఉండటానికి భయమా నీకు? ముందీ మాటకు జవాబు చెప్పు?" అన్నాడు నవ్వుతూ.

"నాకు భయమనికాదు. ఎందుకీ ఆలస్యమని నా ప్రశ్న"

"నీ స్వంత ప్రశ్నగ్గాని భయంపుట్టి కాదన్నమాట! "అయితే చెప్తా విను. ఈ స్కూల్లో నా జీతమా 'గొఱ్ఱెతోక బెత్తెడు' అన్నట్టుగా నూట ఏభయి రూపాయలు నా చదువు సంగతంటావా ఇంగ్లీషు డిగ్రీలులేని సంస్కృతాంధ్ర భాషలు. వీటికి జీతం ఇంతకంటె ఎక్కువరాదు. మన పొలాలు అంటే ఎప్పుడూ ఒక రీతిగా పండవు. పండితే పాడి పంట, స్వంత ఇల్లు పెద్దది ఘనంగానే ఉంటుంది. కాని-అవి పండని పక్షంలో మన సంగతి ఏమిటి?"

యశోదలో కొంత చమత్కారము మరి కొంచెమెక్కువ హాస్యం కూడా ఉన్నాయి. వాటిని అన్నివేళలా ఉపయోగించదు. ఈ సమయం బాగానే ఉందని నోరు విప్పింది- "ఏమిటి అన్న ప్రశ్న ఏమిటి? ఉన్నదాంట్లో బతకటమే మన మిద్దరం పెద్దవాళ్ళిద్దరూ, అంతేగా? మనకు గడవదా? అయితే ఇన్నేళ్ళూ ఇదా మీరు ఆలోచిస్తున్న విషయం? ఏమయినా సమాధానం దొరికిందా?" విరగబడి నవ్వింది.

యశోదా! అట్లా నవ్వితే చెప్పను" అన్నాడు మూతిబిగించుకుని.

"కాదు-కాదు మీరు చెప్పాల్సిందే. నేను వినాల్సిందే. ఇంతలోకే అంత కోపమా?"

"మనం ఎప్పుడూ ఇద్దరమేనని అనుకోకు. రేపంటే రేపేకాదు-ఇకముందు

పిల్లలు పుట్టవచ్చు. ఈ జీతంలో పిల్లల పెంపకం చదువులు వాళ్ళ డ్రెస్సులు రోగాలూ, మందులూ అన్నీ కుదరవు డబ్బుచాలదు. అప్పుడు మనం ఇట్లాగే నవ్వుతూ హాస్యాలాడుతూ చమత్కార సంభాషణలు చేసుకుంటూ ఉండలేము. మనిద్దరిమధ్యా సుఖసంతోషాలు కరవవుతాయి. అందుకని - బాగా విను. నేను డిగ్రీలూ. పెద్ద ఉద్యోగాన్ని ఇవ్వగల చదువు సాయంత్రంపూట ఒక రిటైరయిన ప్రిన్సిపల్‌గారిదగ్గర చదువుతున్నాను. ఆయనే గబగబా చదువునేర్పే విధానంలో నాకు మెట్రిక్యులేషను, ఇంటరుమీడియట్, బి.ఏ, ఎం.ఏ. చదువుకూడా చెప్పారు. ప్యాసయ్యేటట్టుచేశారు. ఇప్పుడు చదువు అయిపోయింది. ఎం.ఏ. పరీక్షా ఫలితాలు తెలియాలి. బహుశః మే జూన్ నెలలలో పత్రికలో ప్రకటిస్తారు. అప్పుడు ప్రయత్నంచేసుకుని దరఖాస్తులు కాలేజీలలో పెట్టి ఒక లెక్చెరరుఉద్యోగం సంపాదిస్తాను. తెలిసిందా? ఈ సంగతి మా అమ్మకుగాని బామ్మకుగాని తెలియదు. ఈ మధ్య రెండురోజులు సెలవులు సంస్కృత పాఠశాలకు ఇవ్వవచ్చు. ఊరికి వెళ్దామనిఉంది. ఏమంటావు?" అన్నాడు ఆమె ముఖమేచూస్తూ.

బుగ్గమీద వేలువేసుకుంటూ "ఇంతమంచివిషయం భార్యతో అయినా చెప్పద్దూ? అంత రహస్యమేమిటి? ఇంతగొప్పపనిచేసి, వాళ్ళకు చెప్పకపోవట మేమిటి? పదండి. రేపు పొద్దున్నేబయలుదేరితే గంట ప్రయాణం" అంది సంతోషంతో.

తనమీదవేసిన అభాండాన్ని యశోద అప్పుడే మరిచిపోయింది. తెల్లవారు ఝామనలేచి వారంరోజులు ఉంటామన్నట్టుగా సామానుసర్దింది.

గంటలుమోగిస్తూ ఎడ్లునడుస్తుంటే యశోద కబుర్లువింటూ మధ్యమధ్య కన్నుమూస్తూ వింటున్నాడు పాండురంగం.

"ఇల్లురాగానేదిగి తనొక్కతేముందుగా లోపలికివెళ్ళి బామ్మగారూ! ఎలా ఉన్నారు? అత్తగారూ ఎలాఉన్నారు? అందరూ క్షేమమా? మీ అబ్బాయికూడా వచ్చారు" అంటూ ఇల్లంతాచుట్టబెట్టి, కొత్తగాపుట్టిన అవుదూడనుచూసి ముద్దు పెట్టుకుని లోపలికివచ్చింది.

అంతలో వాళ్ళిద్దరూ లేచివచ్చి "పాండూ, ఇన్నాళ్లూ కంటికికనబడలేదు. అంతాబాగున్నారా ? నీవు యింటికివచ్చి ఎన్నిరోజులయిందిరా ? మమ్మల్ని

చూడాలనిపించలేదూ? మారిపోయావట్రా?"అన్నారిద్దరూ తడికళ్ళతో. మధ్యమధ్య వెళ్ళి ఒకటి రెండు రోజులున్నా ఈ ప్రసక్తి రాలేదు.

వెంటనే యశోద అందుకుంది "నేను చెప్తాను వినండి. మీ అబ్బాయిగారు ఎ.బి.సి.డిల దగ్గర్నుంచి ఇంగ్లీషుచదువు చదువుతున్నారు. అందులో మొదట నుంచీ చదవాలాయెను. ఇప్పుడు ఎం. ఏ. పరీక్ష రాశారట. ఇంకా ఫలితాలు తెలియలేదు. తెలియగానే పెద్దఉద్యోగం వస్తుందట. ప్రయత్నాలు మొదలు పెట్టాలని చూస్తున్నారు" అని గబగబా పాఠం ఒప్పచెపినట్టు చెప్పింది.

"అట్లాగుట్రా? మీ తాతలూ తండ్రులూ చదివినచదువే నీకు చెప్పించారు. పోనీ ఒక్కపిల్లాడని ఈ చదువు చెప్పించాలని వాళ్ళకు తోచలేదు. ఆరోజుల్లో ఈ చదువుచెప్పేవాళ్ళు ఇక్కడలేరనుకో. ఏదో వాళ్ళకుతోచినట్టుచేశారు. ఇప్పుడు నీవు చదువుకున్నావు కష్టపడి. చాలా మంచిపనేచేశావు. ఎప్పటికేది అవసరమో అప్పటికిగాని ఆలోచనరాదుకదా!" అంటూ కొడుక్కి యిష్టమైన వంటలు చేయించింది తల్లి.

అందరూ సరదాగా నవ్వుకుంటూ భోజనాలుచేసి పగటినిద్రకొరిగారు.

ఆ సాయంత్రం పొలాలుచూసి రైతులతోమాట్లాడివచ్చాడు పాండురంగం. పాడి బాగాఉంది. నెయ్యి వెన్న పాండురంగంతల్లి కొడుక్కి పంపుతూ ఉంటుంది. రెండునెలలకోసారి బియ్యంకూడా పంపుతుంది.

ఆ పల్లెటూళ్లో రెండురోజులు గడిచినప్పటినుంచీ పాండురంగానికేం తోచలేదు. ఇక వెళ్ళాలని మొదలుపెట్టాడు, యశోద చాలా రోజులకు వచ్చామనీ తొందరపడవద్దనీ చెబుతున్నది. కాని అతడు పరీక్షాఫలితాలకు ఎదురు చూస్తున్నాడు.

వాళ్ళకు కావలసినవి పచ్చళ్ళూ ఊరగాయలూ ఉపాహారాలూ చేయించింది తల్లి. నాలుగోనాడు బయలుదేరారు. పెద్దవాళ్ళిద్దరూ ఎన్నో జాగ్రత్తలుచెప్పి పంపిందారు. వాళ్ళు వెళ్ళిన తరువాత మళ్ళీ ఒంటరివాళ్ళమయ్యామని బాధపడ్డారు.

ఇంటికివచ్చిన మరునాటినుంచీ స్కూలునుంచి ప్రిన్సిపల్‌గారింటికివెళ్ళి ఆయనను చూడాలని ఆరాటపడటం "రేపువెళ్ళండి" అని యశోదఆపటం రెండు రోజులు జరిగింది.

మూడవనాడు వెళ్ళాడు. పరీక్షాఫలితాలు తెలియలేదు కనుక ప్రిన్సిపల్ ఒక ఉపాయంచెప్పాడు. నీకు కాలక్షేపంగానూ కొంత ఆంగ్లభాషా బోధనకు అలవడినట్టుగానుఉంటుంది. నాలుగుడబ్బులు చేతిలోపడినట్లూఉంటుంది. అందుకని "నీవు ఇంటిదగ్గర సాయంత్రపువేళ ఇంగ్లీషుభాష నేర్పుతానని పిల్లలకుచెప్పు. తెలుగుచదువుకునే పిల్లలకు సెలవులేగా? కొందరు రావచ్చు" అన్నాడు.

మరునాడే పాండురంగం "ఇక్కడ ఇంగ్లీషుభాష నేర్పబడును. సాయంత్రం నాలుగున్నరనుండి ఆరుగంటల వరకూ క్లాసులు నడపబడును. అవసరమయిన వాళ్ళు వచ్చి వివరాలు తెలుసుకోవచ్చును" అని ఒక అట్టమీదరాసి ఇంటిముందు వేలాడదీశాడు.

రెండు మూడు రోజులు బోర్డు చూసిన తరువాత ఆ ఊళ్ళో కొంతమంది తండ్రులకూ పిల్లలకూ ఆ భాష నేర్చుకోవాలన్న కుతూహలం కలిగింది. మరునాడు పిల్లలను తీసుకుని వచ్చారు తండ్రులు.

బేరాలు మొదలు పెట్టారు.

"మీరిస్తానంటున్న ఐదు రూపాయలకు నేను చెప్పలేను. అక్షరాలు రాగానే మాటలు మొదలు పెడతాను. ప్రతి విద్యార్థిచేత రాయించాలి. తప్పులుదిద్దాలి. వాళ్ళచేత నోటితో పలికించాలి. అవి రాగానే మాటలు నేర్పించాలి. మీరనుకున్నంత సులభంకాదు" అని ఆఖరిమాటగా నెలకు ఎనిమిది రూపాయలకు చెబుతానన్నాడు.

కొంతమంది ఆ భాషమీదగల అభిమానమే కాకుండా ఉద్యోగాలు తొందరగా వస్తాయన్న భావమూ, ఈ రోజుల్లో ఆంగ్లభాష రాకపోతే పిల్లలకు జీవనాధారం కష్టమనీ, అనుకుని చేర్చి మరునాటి నుండీ పంపటం మొదలుపెట్టారు.

అలా రోజుకొకరు రెండురోజులకొకరు వంతున పదిమంది పిల్లలుచేరారు. పాండురంగం వచ్చిన పిల్లలకు జాగ్రత్తగా పాఠాలు చెబుతున్నాడు.

మే జూన్ నెలలు గడుస్తున్నాయి. కాని ఇంకా పరీక్షా ఫలితాలు రాలేదని పాండురంగం ప్రిన్సిపల్ దగ్గరికి వెళ్ళి అడుగుతున్నాడు.

"వస్తాయి. దిద్దటమయితే వాళ్లేం చేసుకుంటారు ఫలితాలను ప్రకటించకుండా?" ప్రిన్సిపల్ చెబుతునే ఉన్నాడు.

పాండురంగం నిరుత్సాహంతో ఇంటికి వచ్చేవాడు.

ఒకనాడు పత్రికలో ఎం. ఏ కరెస్పాండెన్సు కోర్సు పరీక్షా ఫలితాలు వచ్చాయనగానే పేపరుకొని, చదివి, ప్రిన్సిపల్‌కి చెప్పటానికి వెళ్ళగానే ఆయన చాలా సంతోషించాడు. కొన్ని కాలేజీలపేర్లు చెప్పి వాటికి దరఖాస్తు పంపమని చెప్పాడు.

ఇంటికి రాగానే ఆయన చెప్పిన కాలేజీలన్నిటికి దరఖాస్తులు పంపాడు. ఎవరు-ఎక్కడ-కాలేజీ ఉందని చెప్పినా దరఖాస్తు పంపుతున్నాడు విసుగులేకుండా. ఉదయంపూట స్కూలు, సాయంత్రము ట్యూషన్లు-తీరిక అంతగా ఉండటంలేదు-కాని అతడు ప్రాముఖ్యము పిల్లల పాఠాలకంతగా ఇవ్వటంలేదు.

ఒకరోజు వెళ్ళినప్పుడు ప్రిన్సిపల్ "మీరు ఆంధ్రాయూనివర్శిటీకి వెళ్ళి దరఖాస్తు స్వయంగా ఇవ్వండి. విశాఖపట్నంలో ఉన్న కళాశాలలకన్నిటికీ వెళ్ళి దరఖాస్తులు ఇచ్చిరండి" అన్నాడు. ఇతడికి అక్కడ ఉద్యోగం దొరకవచ్చునన్న ఆశాభావం కలిగింది.

ఒకసారి ఊరికి వెళ్ళినప్పుడు యశోదను చూడగానే "యశోదా! నిన్ను చూస్తుంటే ఏదో కొత్తగా ఉన్నావు. ఏదయినా విశేషమా? చెప్పు భిడియపడకుండా చెప్పమ్మా" అడిగారు బామ్మగారు.

"ఏమీలేదండి. ప్రయాణం చేశాంకదా? అందులో ఎడ్లబండిప్రయాణం. అందుకని కాస్త బడలికగా ఉంది అంతే"

"ప్రయాణంచేస్తే బడలికగా ఉంటే మాత్రం ముఖం అలా ఉండదు. నాకు కాకపోయినా మాకోడలికి చెప్పపోసీ"

కావేరమ్మా బామ్మగారూ ఇద్దరూ కలిసి ఆమాటా ఈమాట చెప్పి యశోదచేత నిజం చెప్పించారు.

బామ్మగారు సంతోషంతో "అయితే ఇక్కడ ఉండిపో. వాడెక్కడైనా భోజనం చేస్తాడులే" అన్నారిద్దరూ.

ఇప్పటినుంచీ ఎందుకండీ? ఆయన ఎక్కడెక్కడో తిరిగి ఏ వేళకో ఇంటికి

వస్తారు. అప్పుడు ఎక్కడికని భోజనానికి వెళ్తారు? నేను ఇద్దరివంట చెయ్యలేక పోతానా? తొమ్మిదోనెల రాగానే వస్తాను. బండిలో కుదుపులేకుండా పరుపు వేయించుకుని మరీ వస్తాను. నన్ను ఇక్కడదించి ఆయన విశాఖపట్నం వెళ్తారట. అక్కడ ఎన్నాళ్ళో ఉండరట. ఒక్క వారం మాత్రమే. ఇప్పటినుంచీ ఉంటే ఆయన వచ్చి ఇబ్బంది పడతారు నన్ను వెళ్ళనీయండి" అన్నది.

"చిన్నపిల్లయినా ధైర్యంగా ఉంటానంటోంది వెళ్ళనీ. వారమేగా?" అనుకుని ధైర్యంగా చెప్తున్నావు. జాగ్రత్తగాఉండు. పక్కింటి మామ్మగారిని కూర్చోబెట్టుకో"మని మరీమరీ చెప్పారు.

ఇల్లుచేరుకోగానే పాండురంగం ప్రిన్సిపల్‌గారి దగ్గరకెళ్ళి "ఈ ఏడాది సగంగడచిపోయింది. మళ్ళీ సంవత్సరానికయినా నా అప్లికేషన్లను తీసుకు వెళ్తాను" అన్నాడు.

బయలుదేరేటప్పుడు యశోద "క్షేమంగాపోయి లాభంగా రండి" అతడు కనుమరుగైయేవరకూ చూసి బండి ముందుకు పోతుంటే తను వెనక్కు తిరిగింది.

అతడు మొదట ఆంధ్రాయూనివర్శిటీ కాలేజికి ప్రిన్సిపల్‌ని కలుసు కోవాలని వెళ్ళినప్పుడు మొట్టమొదట టైపిస్టు కలిశాడు. "ప్రిన్సిపల్ గారు ఉన్నారా? వారిని కలుసుకోవాలని వచ్చాను." అన్నాడు.

"వారు ఆఫీసులోనే ఉన్నారు. వెళ్ళి చూడండి" అన్నాడు టైపిస్టు.

తనపేరు విద్యార్హతలు ఒక కాగితమ్మీద రాసిచ్చి ప్రిన్సిపల్‌కి అంద చేయమని నౌకరికిచ్చాడు. అతడు రెండు నిమిషాలలో వచ్చి లోపలికి రమ్మంటున్నారు" అన్నాడు.

కాళ్ళూచేతులు వణకుతున్నా బిగబట్టుకుని ధైర్యంగా లోపలికి వెళ్ళాడు.

ప్రిన్సిపల్ అతడు పంపించిన చీటీ చూస్తూ "ఏంపనిమీద వచ్చారు?" అడిగాడు.

"నేను సంస్కృతాంధ్ర భాషలలో పండితుడనండి. ఎం.ఏ కూడా ప్యాసయ్యాను. మీ కాలేజీలో ఖాళీలుంటే ఉద్యోగమిస్తారని మీ దర్శనానికి వచ్చాను" అన్నాడు.

అతడిని మళ్ళీఒకసారి కళ్లెత్తిచూసి,"మీకు ఉద్యోగం ఇవ్వటానికేమభ్యంతర ముంటుందండీ? ఇంత క్వాలిఫైడ్ పర్సన్‌కి ఉద్యోగమివ్వకపోతే కాలేజీలూ యూనివర్శిటీలూ ఎందుకండీ? తప్పకుండా మీకు ఉద్యోగం దొరుకుతుంది. రెండు రోజులయిన తరువాత కనబడండి" అని లేచాడు.

పాండురంగం తబ్బిబ్బయిపోయాడు.

''సెలవు తీసుకుంటానండి." అంటూ లేచాడు.

"అప్లికేషన్ ఇచ్చి ఊరికి వెళ్తారా?'' కుతూహలంతో అడిగాడు ప్రిన్సిపల్.

"ఇక్కడే ఉంటానండి. మీరు రెండురోజుల తరువాత రమ్మన్నారు కదండీ?"

"మంచిదే ఉండండి. రెండురోజులకోసం ఏం వెళ్తారు? రైలు ఖర్చు దండుగ" సానుభూతి చూపించాడు ప్రిన్సిపల్.

పాండురంగం ఆ దగ్గరి హోటల్లో భోజనంచేసి ఒక యింటి అరుగుమీద పడుకున్నాడు.

రెండురోజులయిన తరువాత ప్రిన్సిపల్ రమ్మన్న వేళకు వెళ్ళి దర్శనం చేసుకున్నాడు.

అతడిని చూసిన క్షణంలోనే ప్రిన్సిపల్ మెదడులో మెరుపులాంటి ఆలోచన మెదిలింది.

"పాండురంగంగారూ, మీరు ఇక్కడికి రావటం ఈ కాలేజీ చేసుకున్న అదృష్టం. మీరు అప్లికేషన్ పెట్టండి. ప్రస్తుతం ఈ కాలేజీలో అన్ని సబ్‌జెక్టులకూ అందరూ అనుభవజ్ఞులు ఉన్నారని రిజిస్ట్రార్ చెప్పాడు. సంస్కృతాంధ్రభాషలకు మాత్రం సరియైన కాండిడేట్ దొరకక, తాత్కాలికమైన ఏర్పాటు ప్రతిఏడూ చేస్తున్నాము. మీ అప్లికేషన్ ఈ సెలవుల్లో కమిటీ సమావేశమైనప్పుడు దానిలో పరిశీలిస్తాము. ఈ సమావేశము జరగటానికి సెలవులురావాలికదా. ఆ పోస్టు మీ కివ్వటం ఖాయం. ఈ సమావేశమొక ఫార్మాలిటీ అనుకోండి" అన్నాడు.

"అయ్యో! మీ మేలు మరిచిపోను." అని లేచి ఒంగి నమస్కారంచేశాడు పాండురంగం.

"దానికేమిటిలెండి. ఇంత విద్వత్తు చేతిలో ఉన్నప్పుడు దిగులు పడ నవసరంలేదు."

"చిత్తం".

"అయితే మీరు ఈ పదిరోజులు ఇక్కడే ఉంటారా ? లేక మీయింటికివెళ్ళి వస్తారా ?" అడిగాడు ప్రిన్సిపల్.

"ఇక్కడే ఉంటే పదిరోజులకూ నాకుమించిన ఖర్చవుతుందేమోనని ఆలో చిస్తున్నాను." అన్నాడు చేతులు నులుపుకుంటూ.

"చూడండి పాండురంగంగారూ డబ్బు జాగ్రత్తగా వాడుకోవటం మంచిదే. కాని - అన్నివేళల్లో ఆ సూత్రం పనికిరాదు. అప్పుడప్పుడు కాస్త చెయ్యి వదు లుతూ ఉండాలి. ఇంకా పదిరోజులటైముంది కనుక - ఈలోగా నాకొక చిన్నపని చేసిపెట్టగలరా ?" అంటూ ఆయన ముఖంలోకిచూశాడు.

"సందేహించకుండా చెప్పండి. చేస్తాను." అన్నాడు ప్రిన్సిపల్ అంతటి వాడు తనకు పనిచెప్తే చేయకపోవటమా ? అనుకుంటూ.

"చాలా సులభమైంది. ఎంతో సంతోషంతో చేసేపని. మా నాన్నగారు ఒకఏడాదినుంచీ కడుపునొప్పితో బాధపడుతున్నారు. ఇక్కడ డాక్టర్ల చేత వైద్యం చేయించాను. లాభం లేకపోయింది. మా అబ్బాయి షికాగోలో ఉన్నాడు. అక్క డికి పంపితే పెద్ద డాక్టర్లకు చూపించి వైద్యం చేయిస్తానన్నాడు. ఆయన ఒక్కరూ వెళ్ళేస్థితిలో లేరు. మీరు కనబడగానే "మానాన్నగారితో వెళ్ళగలరన్న ధైర్యం కలిగింది. టికెట్లూ వీసాలు మొదలైన పనులు మా చిన్నబ్బాయి చేస్తాడు. మీ ఫోటో ఒకటి ఇవ్వండి వీసాకు అవసరముంటుంది. ఖర్చంతామాదే."

"ఫోటోలు లేవండి"

"లేకపోతే తీసుకోండి. ఇవాళయిస్తే రేపు ఇస్తాడు."

"మీకిష్టమేగా ఈ ప్రయాణం ? అయితే మా అబ్బాయికి ఫోనుచేస్తాను - మీవెంట పంపుతున్నానని" అన్నాడు ప్రిన్సిపల్ కాస్తాగి.

"చెయ్యండి సర్. నేనువెళ్తాను." అన్నాడు.

"నేను కూడా బొంబాయివరకూ వచ్చి మిమ్మల్నిద్దరినీ విమానంలో కూర్చో బెడతాను. విమానం ఇంకెక్కడా ఆగదు. సరిగ్గా షికాగోలోనే ఆగుతుంది. విమానాశ్రయానికి వచ్చి ఇంటికి తీసుకువెళ్తాడు మా అబ్బాయి. మీకు దారిలో ఏమాత్రం ఇబ్బందీ కలగదు. మీకు ఏ సహాయం కావలసివచ్చినా ఎయిర్ హోస్టెస్‌ని అడగండి. మీరు అక్కడికి చేరగానే డాక్టరికి చూపించి తిరిగిరావచ్చు. మీకేం కష్టంకలగదు. డబ్బుఖర్చు లేకుండా షికాగో అంతా చూసిరావచ్చు. ఏమంటారు?" అని అతడు చేతిలోనుంచి ఎక్కడ జారిపోతాడో నన్నట్టుగా మెల్లగా సర్దిచెబుతున్నాడు ప్రిన్సిపల్.

"తొందరగా తిరిగి రావచ్చంటున్నారు కనుక నేను వెళ్తాను."

"పెద్దలకు సేవచేయటం ఒక పుణ్యకార్యమని అంటారు. నేను మీ నాన్న గారిని జాగ్రత్తగా తీసుకువెళ్ళి మీ అబ్బాయిగారికి ఒప్ప చెబుతాను. నన్ను తొందరగా పంపించవలసి ఉంటుంది. నా భార్య చాలా కాలానికి గర్భవతి అయింది. ఆమె ఇప్పుడు ఒంటరిగాఉంది. ఆమెను మా బామ్మగారి దగ్గరికి చేర్చ వలసి ఉంది" అన్నాడు వినమ్రుడై.

"అలాగే వెళ్ళవచ్చు. వీసాకోసం అబ్బాయితో మీరు మద్రాసు వెళ్ళాలి. వాడికి ఆఫీసులో అందరూ తెలుసు. పని సులభంగా అవుతుంది. ముందు మూడు నెలలకు టికెట్ ఇస్తారు. ఈ లోపల మీ యిష్టం వచ్చినప్పుడు తిరిగిరావచ్చు. మా అబ్బాయి దగ్గరనుంచి స్పాన్సర్ చేసిన కాగితాలు కూడా ఉన్నాయి. రోగికాక ఇంకొకరికి."

పాండురంగానికి ఆనందం పొంగుకుంటూ వచ్చింది.

ఆయన పెద్ద అధికారి అన్నట్టుగా మాట్లాడటంలేదు. ఒక స్నేహితుడితో మాట్లాడినట్లు మాట్లాడుతున్నాడు. అది కూడా గౌరవించి మాట్లాడుతున్నాడు. ఆయన అవసరానికి ఆదుకుంటే, ముందు ముందు తనకు అనేక లాభాలుంటాయి. తను బయలుదేరినవేళ మంచిది. తను నిజంగా అదృష్టవంతుడననుకున్నాడు పాండురంగం.

ప్రయాణం రోజున మీరు బట్టల సంగతి చెప్పనేలేదు. ఒకజత రెడీమేడ్ బట్టలు కొనుక్కోండి. బైటికి వెళ్ళినప్పుడైనా మంచి బట్టలు వేసుకుని వెళ్ళండి.

మరొక విషయం మా నాన్నగారు పెద్దవారు కనుక చెయ్యిపట్టుకుని నడిపించండి. విమానంలో తూలి పడిపోతారేమో జాగ్రత్తగా చూస్తూ ఉండాలి."

"మీరు చెప్పినట్టే చేస్తాను సర్. భయపడకండి."

"విమానం ఆగగానే మా అబ్బాయి కుర్చీతో వస్తాడు.

అన్నట్టు ప్రయాణంలో ఉలెన్‌కోటు టోపీ అవసరం. మఫ్లరయినా సరే నా దగ్గరున్నవి ఇస్తానులెండి మీకు"

ప్రిన్సిపల్ చిన్న కొడుకుతో పాండురంగం మదరాసు వెళ్ళి వీసా తీసుకుని వచ్చేటప్పటికి నాలుగు రోజులయింది.

ఆ మరునాడే ప్రయాణం.

పాండురంగం ఎప్పటిమాదిరిగా హోటల్‌కివెళ్ళి భోజనం చెయ్యాలనుకుంటూ టైపిస్టుకుకూడా చెప్పివెళ్దామని ఆఫీసులో అడుగుపెట్టాడు.

"ఏమండీ మీ ప్రయాణమెప్పుడు?" అడిగాడు టైపిస్టు. అక్కడే గుమాస్తా కూడా ఉన్నాడు.

"రేపటికి అని అన్నారు. నేను త్వరగావచ్చి మా ఊరువెళ్ళాలి. చాలా అవసరమైనపని ఉన్నది"

"అలాగా? అయితే వెళ్ళిరండి" అన్నారిద్దరూ. పాండురంగం అటువెళ్ళగానే కిసుక్కుననవ్వుకున్నారు నోటికిచేతులు అడ్డంపెట్టుకుని.

పాండురంగం హోటల్‌కివెళ్ళి కాఫీతాగి తన బట్టలు జాగ్రత్తగా పెట్టెలో సర్దుకుని భోజనంచేసి పడుకున్నాడు మంచినిద్రపట్టింది.

మరునాడు విమానంలో ప్రిన్సిపల్ తండ్రిని చెయ్యిపట్టుకుని తీసుకువెళ్ళి సీట్లోకూర్చోబెట్టి, ఎయిర్‌హోస్టెస్ చెప్పినట్టు సేఫ్టీ బెల్టుబిగించి, అతడు పక్క సీట్లో కూర్చున్నాడు. వాళ్ళు ఇచ్చినప్పుడు కాఫీ తాగించాడు. భోజనంపెట్టినప్పుడు తినిపించాడు. షికాగోచేరేవరకూ ఆయన చెయ్యిపట్టుకునే కూర్చున్నాడు.

షికాగోలో ఎయిర్‌పోర్టు దగ్గరికి ప్రిన్సిపల్ కొడుకు కుర్చీతోవచ్చి దానిని

నెట్టుకుంటూ కారులోకూర్చోబెట్టి ఇంటికి తీసుకువెళ్ళాడు. తాతగారికి ఒకగది చూపించి పక్కమీద పడుకోబెట్టాడు.

అంతలో అతడిభార్య "నాకు ఆఫీసువేళయింది. నేను వెళ్తున్నానని" కారు స్టార్టుచేసుకుని వెళ్ళిపోయింది. కొడుకు పాండురంగంతో "బల్లమీద హార్లిక్సుఉంది. కలిపిఇవ్వు. నేను వంటకుసామగ్రి కొనితీసుకువస్తాను" కారుతీసుకుని వెళ్ళాడు.

పాండురంగానికి ఇదంతా కొత్తగాఉంది. "ఇల్లంతా ఆఫీసులాఉంది. భోజనాలు ఇంట్లో చెయ్యరా?" అనుకున్నాడు. సామగ్రి రాగానే వంటచేసి, పెద్దాయనకుపెట్టి, తను భోజనంచేసి ఆయన మంచందగ్గరే తివాచీమీద బట్ట పరచుకొని పడుకున్నాడు.

వెళ్ళిన మూడవనాడు తాతగారిని డాక్టరు దగ్గరికి తీసుకువెళ్ళుతూ తనను కూడా రమ్మన్నాడు కొడుకు.

డాక్టరు పరీక్షచేసి "ఆలస్యంచేశారు. ముందుగా టెస్టులన్నీ చేయించుకుని రేపు రండి" అని రాసి ఇచ్చాడు.

ఆ మూడోనాడే ఆపరేషను. ఆయనను తీసుకుని హాస్పిటల్‌కివెళ్ళారు. ఆపరేషను బాగానే జరిగింది. కాని-ఒకగంట తరువాత రోగి మరణించాడు.

ఆపరేషనువల్ల ఏది జరిగినా తను బాధ్యుడనుకానని డాక్టరు ముందే రాయించుకున్నాడు కొడుకుచేత.

రోగి చనిపోయిన తరువాత ఏదోవిధంగా అంత్యక్రియలు నిర్వహించి వెంటనే తండ్రికి టెలిఫోనుచేశాడు. నాన్నా, తాతయ్యకు ఆపరేషని చెయ్యాలని పంపించారు కాని-డబ్బులేకుండా పంపించారు. నాదగ్గర తగినంత డబ్బులేదు. బిల్లు ఆపిపెట్టాను. వెంటనే డబ్బుపంపించండి. వెంట ఒక మనిషిని పంపించారు. చేతిలో ఒక్క రూపాయయినాలేకుండా అతడిని నేను పోషించలేను అన్నాడు.

పాండురంగంతో "ఆయనపంపితే నీవెట్లావచ్చావయ్యా డబ్బులేకుండా. నిన్ను నేను పోషించలేను. నీ యిష్టమువచ్చినచోటికివెళ్ళు" అని బైటికి పంపించి తలుపువేసుకున్నాడు అతడి బట్టలపెట్టె చేతికిస్తూ. "అబ్బాయిగారూ, నా టికెటు వీసా బల్లమీదున్నాయి. ఇవ్వండి"అని తలుపుకొట్టాడు" అబ్బాయి వీసామాత్రమిచ్చి టికెటులేదు" అని తలుపువేసుకున్నాడు.

పాండురంగానికి అక్కడ ఎవరు తెలుసునని వెళ్తాడు? కాని అక్కడి నుంచి వెళ్ళకతప్పదు. రోడ్డుమీద నడుస్తున్నాడు. వచ్చేకార్లూ వెళ్ళేకార్లూ చూస్తూ దారిన నడుస్తున్నాడు. ఒకచోట కార్లన్నీ ఆగి ఉన్నాయి. ఎదురుగా బట్టలషాపు లున్నాయి. లోపలికివెళ్ళి బట్టలు వేసిచూసుకుని కొనుక్కుపోతున్నారు. కొన్ని కార్లు వెళ్ళిన తరువాత లోపలికి వెళ్ళినవాళ్ళు బైటికివచ్చేవరకూ ఆగి, వాళ్ళకు తన పరిస్థితినంతావివరించి ఇండియాకువెళ్ళటానికి డబ్బుసహాయంచేయమని అడిగాడు. కొందరు అతడు చెప్పినదంతావిని సారీఅంటూ వెళ్ళిపోయారు. ఒక పెద్దాయన మాత్రం పదిడాలర్లకాగితం చేతికిచ్చాడు.

ఇంకా దీపాలు వెలుగుతున్నాయి. కాని జనం పలచబడ్డది.

రాత్రిఅయింది కడుపులోఆకలి. కొంతదూరంనడిచి బాటకు దూరంగాఉన్న చెట్టుక్రింద పడుకున్నాడు. చలి గడగడలాడించివేస్తున్నది. ప్రిన్సిపల్ ఇచ్చిన టోపీ తలక్రింద పెట్టుకుని కోటు కప్పుకున్నాడు.

మానసికంగా శారీరకంగా అలసిపోయిఉన్నాడు. వెంటనే నిద్రపట్టింది.

తెల్లవారగానేలేచాడు. అక్కడిపొలాలకు నీళ్ళు పెద్దగొట్టంద్వారా పడు తున్నాయి. పాండురంగం ఆనీళ్ళతో ముఖంకడుక్కుని రోడ్డుమీదికిరాగానే కార్లు ఒకదానివెనకఒకటి పరుగులుతీస్తున్నాయి. పాండురంగం ఆ బాటమీదనే నడుస్తు న్నాడు వాటినిచూస్తూ.

అక్కడ ఒకచిన్నకొండఉంది. అందరూ పైకిఎక్కుతున్నారు. చాలామంది తెలుగువాళ్ళమాదిరిగా కనబడ్డారు.

"కొండమీద ఏముంది?" అడిగాడు అక్కడివాళ్ళను.

"ఈవేళ శ్రీరామనవమి, సీతారామ కళ్యాణమహోత్సం జరుగుతున్నది."

"ఇంతమంది తెలుగువాళ్ళుచేరినచోట తనకు భోజనం దొరకక్కపోతుందా?" అనుకుని ఆశపడి పైకివెళ్ళాడు పాండురంగం.

కళ్యాణోత్సవాన్ని తెలుగువారందరూ బారులుతీర్చికూర్చుని చూస్తున్నారు. మధ్యాహ్నం పన్నెండుగంటలకు పట్టాభిషేకం జరిగింది. అందరూ ఒక్కసారే లేచారు.

తెలుగు ఆడబడుచులు కొందరు నాలుగుస్టవులూ వంటసామగ్రీ ఇళ్ళనుంచి తీసుకువచ్చి, తెలుగు పిండివంటలతో వంటలుచేశారు. పక్కహాల్లో బల్లలూ కుర్చీలూ ఉన్నాయి. అందరూవచ్చి కూర్చున్నారు.

అమ్మాయిలు కొందరు "ఐటమ్‌కింత" అన్ని బిల్లురాసి టికెట్లుఇచ్చి డబ్బు వసూలుచేస్తున్నారు. కొందరు టికెట్లు కొన్నవాళ్ళకు వడ్డించిన పళ్ళేలు చేతికిస్తున్నారు. కుర్చీలు ఖాలీ అయినకొద్దీ కొత్తవాళ్ళువచ్చి కూర్చుంటున్నారు టికెట్లు కొనుక్కొని.

పాండురంగం కడుపులో ఆకలిగాఉన్నా ఏమీచేయలేక నిలబడి చూస్తున్నాడు.

ఇద్దరు తెలుగువాళ్ళు "ఏమండీ భోజనంచేశారా?" అని అడిగారు.

డబ్బులేదని చేతిసైగచేశాడు.

"శ్రీరామనవమిపూట ఉపవాసముండటమేమి"టని వాళ్ళిద్దరూ చెరికొంచెం వేసుకుని, ఇంకా ఇద్దరిదగ్గర పోగుచేసుకునివచ్చి, అతడికి భోజనం పెట్టించారు.

పాండురంగం వాళ్ళతో తన పరిస్థితి అంతాచెప్పి ఇండియాకు తిరిగి వెళ్ళటానికి డబ్బుసహాయం చెయ్యమని చేతులుజోడించి అడిగాడు.

డబ్బుగలదేశమని పేరు. కాని ఒక్క సెంటుఅయినా పుట్టలేదు.

ఒక్కొక్కరే కొండదిగి కార్లుఎక్కి వెళ్ళిపోతున్నారు.

పాండురంగం బిక్కముఖంవేసుకుని చూస్తున్నాడు. అర్చకుడు గుడిలోనుంచి బయటికివచ్చి "నిలబడిపోయారేం?" అని అడిగాడు-అంగ్లభాషలో.

పాండురంగం తన పరిస్థితినంతా ఏకరువుపెట్టాడు.

"నాకు ఆరోగ్యంసరిగాలేదు. మీరు ఇక్కడఉండి పదిహేనురోజులపాటు నా పనిచేసినట్లయితే నా సగంజీతం మీకిస్తానని" అంగ్లభాషలో చెప్పాడు.

"నాకుపూజావిధానం మంత్రాలువచ్చునని మీకెలా తెలిసింది?" ఆశ్చర్యంతో అడిగాడు పాండురంగం.

అతడు నవ్వుతూ "మీరు నాతోగొంతుకలిపి మంత్రాలు చదవటంచూశాను.

మీకు డబ్బు అవసరమన్నట్టుగా తెలుసుకున్నాను. ప్లీజ్ ఈ సహాయం చేసి పెట్టండి" అని వేడుకున్నాడు.

"డబ్బు అవసరము ఉన్నమాటనిజమే. ఈదేశంలో డబ్బులేకుండా ఇరుక్కుపోయాను. కాని-నేను ఇండియాకు అర్జంటుగావెళ్ళాలి. పది పదిహేను రోజులు ఆగలేను" అన్నాడు.

"పోనీ, పదిరోజులయినా సహాయంచెయ్యండి" పూజారి ఎడ్వాన్సుగా ఇరవై డాలర్లు ఇచ్చాడు.

విధిలేక ఒప్పుకున్నాడు పాండురంగం. దినదినగండంగా ఉంది అతడి మనసుకు. ప్రాణం బిగబట్టుకుని ఆ పదిరోజులూఉండి, అతడిచ్చినడబ్బు తీసుకుని కొండదిగి విమానాశ్రయానికి బయలుదేరుతుండగా బస్సొకటి ఎదురయింది. అది విమానాశ్రయానికి పోతుందని తెలుసుకుని బస్సు ఎక్కాడు. బస్సుదిగిన తరువాత అరమైలునడిచి విమానాశ్రయానికి వెళ్ళాడు.

అతడిదగ్గర ఎన్నిసార్లు లెక్కబెట్టినా నలభైడాలర్లుకూడాలేవు. పూజారి ఇచ్చినదీ ఎవరో ఇచ్చినదీ గుడిలో కొందరు మూడు నాలుగు డాలర్లు ఇచ్చినదీ అన్నీకలిపినసొమ్మది. మనసులో ఆందోళన భయమూ పెనవేసుకుపోయి అతడిని ఊపేస్తున్నాయి.

అదృష్టవశాత్తు అక్కడికి కొంచెందూరంలో ఒక తెలుగుకుటుంబం ఇద్దరు చిన్నపిల్లలనుగురించి వాదించుకుంటున్నారు. ఆ యిద్దరు చిన్నపిల్లలనూ మదరాసుకు పంపాలట.

"కూడా ఎవరూరాకపోయినా ఎయిర్‌హోస్టెస్‌కి అప్పగిస్తే మేము దింపుకుంటామని" తల్లిదండ్రులు ఫోనుచేశారట. కాని పిల్లలను ఒంటరిగా పంపటం తాత గారికి యిష్టంలేదు. ఏ ఒక్కరు బయలుదేరినా తిరిగివచ్చే ఖర్చు ఉంటుంది. ఆవిషయమే ఘర్షణ పడుతున్నారు.

పాండురంగం అదంతావిని "నేను మదరాసువెళ్ళుతున్నాను. ఈ పిల్లలను నాదగ్గర కూర్చొబెట్టుకుని తల్లిదండ్రులకు ఒప్పగిస్తాను. నాకు వీసాఉంది కాని టికెట్‌కి డబ్బులేదు. మీరు టికెట్ కొనియిస్తే తీసుకువెళ్తా"నన్నాడు. వాళ్ళిద్దరూ

బాగా ఆలోచించుకుని, వెళ్ళటానికేకదా టికెట్ అనుకుని విమానాశ్రయంలోఉన్న ఆఫీసుకువెళ్ళి అడిగితే వీసాతోపాటే రానుపోను టికెటు ఇస్తారుగా అన్నారు.

అప్పుడు అది హాస్పిటల్లో జారిపోయిందని అబద్ధంచెప్పి కొనియిచ్చారు. అతడి విషయాన్నీ అడిగి మద్రాసులో పిల్లలను తల్లిదండ్రుల కొప్పగించి ఫోను చేయించమన్నారు. అతడు పిల్లలతో బయలుదేరాడు వాళ్ళిచ్చిన టికెట్‌తో.

పిల్లలు విమానంలో చాలా అల్లరిచేశారు. ఏడ్చారు కథలూ కబుర్లూచెప్పి వాళ్ళను నిద్రబుచ్చి మద్రాసు విమానాశ్రయంలో తల్లిదండ్రులకు ఒప్పగించి టెలిఫోను చెయ్యమన్నాడు. టెలిఫోనుచేసిన తరువాత బయలుదేరాడు అక్కడి నుంచి.

మదరాసునుంచి పాండురంగం తన జేబులోఉన్నడాలర్లను రూపాయలుగా మార్చి విజయవాడవెళ్ళి అక్కడినుంచి బస్సులో ఆలూరుచేరాడు.

గడపలో అడుగుపెట్టగానే పసిబిడ్డ ఏడుపు వినబడ్డది.

అంతలో పాలేరువచ్చి "అమ్మగారూ అబ్బాయిగారొచ్చారు" అన్నాడు.

పాండురంగం పెరట్లోకివెళ్ళి కాళ్ళుకడుక్కుని లోపలికి వచ్చేసరికి ఉయ్యేలలో పిల్లవాడు కంటబడ్డాడు.

కావేరమ్మవచ్చి "ఏమిరా రంగం - ఎంతపని చేశావురా? నెలలు వచ్చిన పిల్లను వదలిపెట్టివెళ్తావురా? సమయానికి పొరుగింటి మామ్మగారు జబ్బుపడ్డదట. ఒక తెల్లవారుఝామున నొప్పులురాగానే భయపడి నడుస్తూ బయలుదేరి తాడి వనంలో రెల్లుగడ్డిలో పిల్లవాడిని కన్నదట. తెలతెలవారుతుండగా కూరగాయల వాళ్ళుచూసి పిల్లవాడికి బొడ్డుకోసి, గడ్డిబండిలో గోనెపట్టాలేసి తీసుకువచ్చారు. అసలు నాదేతప్పు. మీరు వచ్చినప్పుడే ఉంచేసుకోవలసింది యశోదను. నిన్ను నమ్ముకున్నందుకు నట్టేటముంచినట్లుచేశావు" బాగా చివాట్లుపెట్టింది బామ్మగారు.

అతడు నవ్వుతూ "బామ్మా, అన్నీ అనుకున్నట్టుగా జరగవని నీవే అన్నావుగా? అట్లాగే కచ్చితంగా జరుగుతున్నాయి. లేకపోతే నెలపదిహేను రోజులకు తక్కువగా పుడతాడనుకున్నానా? వాడికేం తొందరవచ్చింది చెప్పు?'

"సరేలే ఏడుపులో నవ్వుఅన్నట్టు చేశావు"

"సరిగాని మిగిలినచోట్లు తరువాతవేద్దువుగాని యశోదా పిల్లవాడు కులాసాగా ఉన్నాడుకదా?"

"నీవెక్కడో ఉద్యోగంకోసం వెళ్ళావని యశోద చెప్పింది. నిజమేనా?" అడిగింది బామ్మగారు.

"ఛా, ఛా, ఎవరుచెప్పారు నీకీమాట? అమ్మలేదన్నసంగతి నేనీఊరురాగానే బస్సుదగ్గరే తెలిసింది. నిన్ను చూసుకుంటూ నీ ఎదుటేఉంటాను. ఇంత అన్యాయంగా ఆలోచిస్తానా? అసలు ఇకనుంచీ ఆ వ్యవసాయమేదో నేనే కూలీలనుపెట్టి చేయిస్తాను. అయినా బామ్మా మనపని మనం చేసుకుంటే తప్పేమిటి? వారికీ వీరికీ ఎందుకు ఒప్పగించాలి?" అన్నాడు.

బామ్మగారు కొంగుచాటున నవ్వుకుంది. "వీడికి ఎంతకాలానికి తెలిసిందీ మాట!" అని.

అనాటినుంచీ పాండురంగం వ్యవసాయంపనులు స్వయంగా చూసుకోవటం మొదలుపెట్టాడు. ఆ ఊరిపిల్లలకు మధ్యాహ్నంవేళ రెండుగంటలసేపు చదువు చెప్తాడు.

ఆ సంవత్సరం పంటచూసి ఆశ్చర్యపోతూ పిల్లవాడిని పదే పదే ముద్దు పెట్టుకోవటం మొదలుపెట్టాడు.

గలగలనవ్విన యశోద "పాఠం బాగా నేర్చుకున్నట్టేనా?" అంది.

"పాఠంసరే, వాళ్ళకు నెలలు తక్కువని ఎందుకు చెప్పావు? అందుకే నీకు శిక్షపడ్డది" అన్నాడు.

నాకొక్కదానికేకాదు మనిద్దరికీ ఇది "గుణపాఠమే" నవ్వింది యశోద.

కథా నిలయం
శ్రీకాకుళం